రోడ్లు చూడతరమా..!

ఈ పర్యాయం సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చేవాళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆనందపడాలని సీఎం చంద్రబాబు చెప్పిన మాట. సంక్రాంతి ఎటూ వచ్చేసింది. రోడ్ల రూపురేఖలు మాత్రం మారలేదు. ఎప్పటిలాగే గోతులు, గుంతలు పలకరిస్తున్నాయి. కొన్నిచోట్ల తూతూమంత్రంగా రోడ్లకు మరమ్మతులు చేసినా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మళ్లీ అధ్వానంగా మారాయి. బయటి ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు రోడ్ల దుస్థితిని చూసి కూటమి ప్రభుత్వం చెప్పిన దానికీ, వాస్తవానికి పొంతన లేదని పెదవి విరుస్తున్నారు.

- నగం రోడ్లలో ఎక్కడి గోతులు.. గుంతలు అక్కడే..!
- ఈ మార్గాల్లో వెళ్లలేక ప్రజలకు తప్పని తిప్పలు
- అక్కడక్కడా తూతూమంత్రగానే పనులు
- నాణ్యత కరువై మళ్లీ మొదటికొచ్చిన రోడ్ల దుస్థితి
- ఇదీ పలమనేరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి
- సీఎం మాటలకు..చేతలకు పొంతనే లేదని తేటతెల్లం


వీకోట- కేజీఎఫ్ రోడ్డులో కనిపించని ప్యాచ్‌వర్క్

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో దాదాపు 250 కిమీ తారురోడ్లు ఉండగా వాటిల్లో 60శాతం రోడ్లు వర్షాల కారణంగా అధ్వానంగా మారాయి. వీ.కోట మండలంలోని ముదరందొడ్డి, ఎస్ బండపల్లె, బైరుపల్లె, పాముగానిపల్లె, పెద్దపంజాణి మండలంలోని చామనేరు రోడ్లలో మరమ్మతులకు సంబంధించి రూ.4.13 కోట్లతో 6,395 మీటర్ల మార్గం సరిచేయడానికి నిధులను మంజూరు చేశారు. ఈ పనులు దక్కించుకున్న కూటమి కాంట్రాక్టర్లు పైపైన తూతూమంత్రంగానే పనులు చేయడంతో మరో నెల కూడా ఇవి ఉంటాయనే నమ్మకం లేదు.

ఈ రోడ్లను ఓసారి చూద్దామా..!

నియోజకవర్గంలో రహదారులు పరిస్థితి ఘోరంగా తయారైంది. బైరెడ్డిపల్లె మండలంలోని కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. కనీసం ఆటోలు సైతం వెళ్లలేని దుస్థితికి ఈ మార్గం చేరింది. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ ఎర్రగొండేల్లి- మాదిగబండ రహదారిలో రోడ్డుపై వానపడితే నాలుగుడుల నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడం పరిపాటిగా మారింది. వీ.కోట పట్టణం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని కేజీఎఫ్‌కు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లడం కష్టతరమైంది.పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లె, అప్పినపల్లె రోడ్లు గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ద్విచక్రవాహనాల్లో వెళ్లాలన్నా వీలు కాని పరిస్థితి నెలకొంది. వీ.కోట మండలంలోని గెస్తింపల్లె రోడ్డు మరీ ఘోరంగా మారింది. ఇక వీ.కోట నుంచి అంతర్రాష్ట్ర రోడ్డుగా ఉన్న కేజీఎఫ్ రోడ్డుపై తాజాగా రోడ్డుకు వేసిన మరమ్మతులు అప్పుడే దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలో సగానికిపైగా మరమ్మతులకు గురైన రోడ్లను అస్సలు పట్టించుకోకుండా కొన్ని రోడ్లలో మాత్రం నామ్ కే వాస్తే అన్నట్లు రోడ్లకు మరమ్మతులు చేసి కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం మినహా వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయని ఆయా రోడ్లపై వెళ్లే గ్రామస్తులు చెబుతున్న మాట.





లద్దిగం-కొత్తరోడ్డు క్రాసు నుంచి గుంతలమయమై ప్రమాదకరంగా మారిన బోయకొండ రోడ్డు

బోయకొండ రోడ్డు బాగు చేసేదెన్నడో..?

చౌడేపల్లె: గుంతలమయమైన బోయకొండ రోడ్డును బాగు చేసేదెప్పుడని భక్తులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బోయకొండ గంగమ్మ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది వందలాది వాహనాల్లో నిత్యం వస్తుంటారు. అధిక సంఖ్యలో కర్ణాటక రాష్ట్రం నుంచి రావడం పరిపాటి. పుంగనూరు-చౌడేపల్లె ప్రధాన రహదారి నుంచి లద్దిగం కొత్తరోడ్డు క్రాసు నుంచి కరణంవారిపల్లె మీదుగా కొలింపల్లె క్రాసు నుంచి బోయకొండకు వెళ్లాల్సి ఉంది. ఈ మార్గంలో సింగిల్ రోడ్డు కావడంతోపాటు రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏమాత్రం ఆదమరచినా ప్రమాదాలకు తావిచ్చేలా గోతులు ఉంటున్నాయి. సంక్రాంతిలోపు గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించినా ఇప్పటివరకు మండలంలో రోడ్ల మరమ్మతుల ఊసే ఎత్తడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.


పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె రోడ్డులో గుంతలు




బైరెడ్డిపల్లె మండలంలో గుంతలమయమైన కడపనత్తం రహదారి


పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లె- పుంగనూరు రోడ్డు దుస్థితి

ఒక్కసారి సముద్రపల్లె రోడ్డును చూడండి...



టౌన్‌కు కిలోమీటర్ దూరంలోని టి.వడ్డూరు క్రాస్ నుంచి సముద్రపల్లెకు వెళ్లే రోడ్డు మొత్తం జల్లితో నిండిపోయింది. ఈ మార్గంలో ఎవరైనా ప్రయాణిస్తారా? ఏమాత్రం ఆదమరచినా చేసినా బైక్‌లు కిందపడడం గ్యారెంటీ. ఈ రూట్‌లో వెళితే ఎందుకొచ్చాం రా దేవుడా? అనుకోవాల్సిందే.

-ముజాంబిల్, పలమనేరు

పాతపేట రోడ్డు చూస్తే దడుసుకోవాల్సిందే..!



మా ఊరికి ఉన్న తారు రోడ్డు కిలోమీటర్‌కు వందల గుంతలు పడ్డాయి. కనీసం టూవీలర్లు కూడా ఈ రోడ్లో రాలేవు. ఇప్పటికి చాలా ప్రమాదాలు కూడా జరిగాయి. ఇక్కడ పెద్ద పెద్ద కూటమి నేతలున్నా రోడ్డును బాగు చేయిద్దామనే స్పృహ కూడా లేదు. బయటి ఊర్లనుంచి వచ్చే వాళ్లు కూడా రోడ్లను చూసి దడుసుకుంటున్నారు.

-మమత, సర్పంచ్, పాతపేట, బైరెడ్డిపల్లె మండలం

ఉగాదికైనా రోడ్డు బాగు చేస్తే అదే పదివేలు



మా ఊరి రోడ్డు బాగాలేదని చెబితే వాళ్లు వైఎస్సార్ల అట్టే చెప్తారు అనుకోవచ్చు. అందుకే బెంగళూరు నుంచి మా పల్లెలో సంక్రాంతి పండుగకు వచ్చినోళ్లను అడగండి మా ఊరికి తారు రోడ్డు ఎలా ఉందని? వారు ఎలా వచ్చారో వారే చెప్తారు. సంక్రాంతి కాదు ఉగాదిలోపైనా మా గ్రామానికి రోడ్డు బాగు చేస్తే అదే పదివేలు.

-సురేష్, ఎంపీటీసీ, పాతపేట, బైరెడ్డిపల్లె మండలం

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్ట్ మృతి

చౌడేపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడి మరణించిన సంఘటన సోమవారం రాత్రి పుంగనూరు- బోయకొండ మార్గంలోని కొలింపల్లె సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..పుంగనూరుకు చెందిన బాలాజీ(40) బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చి బైక్‌లో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని కొలింపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని 108 సిబ్బంది మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు.


గాయపడిన బాలాజిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పౌర్ణమి పూజలు

బైరెడ్డిపల్లె: మండలంలో కుప్పనపల్లె సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా పౌర్ణమి పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలతో పాటు రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, శంకర్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. క్రిష్ణవేణి, జయప్ప, రామమూర్తి, క్రిష్ణప్ప, రఘుగౌడు, రమణప్ప, మేఘరాజులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వి.కోటలో..

వి.కోట: ధనుర్మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సదుం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అప్పటి గురువులు వెంకటస్వామి, జయకుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఇస్తామన్నారు.

హోరా హోరీగా కేపీఎల్ క్రీడా పోటీలు


త్రోబాల్ పోటీలో తలపడిన జట్లు

చౌడేపల్లె: క్షత్రియ ప్రీమియం లీగ్ (కేపీఎల్) క్రీడాపోటీలు సోమవారం రెండవరోజు హోరా హోరీగా సాగాయి. ప్రతిఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా దాదేపల్లె సమీపంలోని క్రీడా మైదానంలో క్రికెట్, టెన్నికాయిట్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించడం పరిపాటి. ఈ పోటీలకు పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లె మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. మంగళవారం ఫైనల్స్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కమనీయం.. కల్యాణం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని రాములువారి గుడి వీధిలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణ మహోత్సవానికి కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గోదాదేవి నీరాటోత్సవం జరిపించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక అలంకరించారు. కన్యాకపరామేశ్వరి ఆలయంలో పూజలు చేసి దేవతమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవ వేదికపై ఆశీనులు చేశారు. అనంతరం వేడుకగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పల్లెల్లో కనిపించని పండగ సందడి

- అక్కడక్కడా భోగి మంటలు
- నేడు సంక్రాంతి, రేపు కనుమ
- ఆకాశాన్నంటుతున్న అనపకాయ ధరలు



పలమనేరులో భోగి మంటలు, పెద్దపంజాణి: రాయలపేటలో వేస్తున్న భోగి మంటలు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో ప్రజలు సోమవారం వేకువజామున భోగి మంటలను వేశారు. వయోభేదం లేకుండా మంటల వద్ద చలికాచుకోవడం కనపించింది. ఇక ఇళ్ల లోగిళ్లలో రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు ఉంచారు. ముఖ్యంగా పట్టణంలోని గంగమ్మగుడి వీధి, బ్యాంకు ఏరియా, బజారువీధి, జవిళివీధుల్లోని దుకాణాలు గతంలో సంక్రాంతి పండుక సామగ్రి కొనుగోళ్లకు జనంతో కిటకిటలాడేవి. కానీ ఈసారి పెద్దగా పండుగ సందడి కనిపించలేదు. పూజాసామగ్రి, రంగులు, పశువులకు అలకరించే పెయింట్‌లు, కొమ్ములకు అలంకరణ సామగ్రి, మెడ గంటలు, కొత్త ముగుదాళ్లు, బెలూన్‌లు, చంకీల వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు వాపోతున్నారు.

కిలో అనప రూ.వంద!



ఇలా ఉండగా మొన్నటి వరకూ అనపకాయలు కిలో రూ.50 వరకూ ఉండేవి. పండగ దెబ్బకు రేటు అమాంతంగా రెట్టింపు అయ్యింది. కిలో వందకు చేరాయి. దీంతో పండక్కైనా పితికిపప్పు తినాలనుకున్న సామాన్య జనం ఈ ధరలను చూసి కొనేందుకు ఆసక్తి చూపలేదు.

కళ తప్పిన పల్లెలు

సాధారణంగా సంక్రాంతిని గ్రామాల్లో రైతుల పెద్దపండుగ అని పిలుస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్ హామీలను అటకెక్కించడం, ప్రజలకు పథకాల లబ్ధి అంటూ అంతకపోవడంతో జనం చేతుల్లో డబ్బులేకుండా పోయింది. రైతన్నకు కష్టాలు తప్పలేదు. దీంతో గ్రామాల్లో సైతం పండగ కళ తగ్గింది.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా గ్రామాల్లో తెల్లవారుజామునే పెద్దలు, పిల్లలు ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. కష్టాలన్నీ భోగిమంటల్లో దహించుకుపోవాలని పాత వస్తువులను దహనం చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. తమ జీవితాల్లో చెడులన్నీ తొలగిపోయి అంతా మంచి జరగాలని కోరుకున్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో తెల్లవారు జామున పాతవస్తువులను ఇంటి ముందు వేసి భోగి మంటలు వేశారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పుంగనూరు నియోజకవర్గంలో..

పుంగనూరు/రొంపిచెర్ల/చౌడేపల్లె/పులిచెర్ల(కల్లూరు): పట్టణ, గ్రామీణ ప్రజలు సోమవారం వేకువజామున తమ ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. పాత వస్తువులను మంటల్లో దహనం చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పండుగ సందడి పెద్దగా కనిపించలేదు. ప్రధానంగా ఆకాశాన్నంటిన ధరలు, ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడం, ప్రభుత్వం పథకాలు అమలు చేయకపోవడం, ఎలాంటి ఆర్థిక లబ్ధి కల్పించకపోవడం ..ఇత్యాది కారణాలతో పండుగ సందడి తగ్గిందనే చెప్పాలి.

గుడుపల్లెలో..

గుడుపల్లె: ఇళ్ల ముందు ఉదయాన్నే భోగి మంటలు వేశారు. ధనుర్మాసం నెల ప్రారంభం నుంచి చేసిన భజన కీర్తనలు ముగించారు. గ్రామాలలోని అక్క దేవతల ఆలయాలకు వెళ్లి దీపారాధన చేశారు.

క్లుప్తంగా

ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి


శ్రీనివాసులు

వి.కోట: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దక్షిణాయనానికి ఆఖరు రోజులైన మూడు రోజుల సంక్రాంతి ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ, ఈ ఏడాది అన్ని పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు: మండలంలో పలు ప్రాంతాల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈడిగపల్లె పొలాల్లో పేకాట ఆడుతున్నట్టు పోలీసుల దృష్టికి రావడంతో సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నాగభూషణంతో సహా ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.12,940 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

హోమియో డాక్టర్‌గా ఉమారాణి



పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ హోమియోపతి డాక్టర్‌గా ఉమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఆమె విజయం సాధించి ఇక్కడ డాక్టర్‌గా నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక హోమియో ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలని అందిస్తామని ఆమె చెప్పారు.

నివాళి

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బాబాసాహెబ్ మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ అంటే ప్రాణం ఇచ్చే కార్యకర్త మృతి చెందడం బాధాకరమన్నారు. కష్టకాలంలో మృతుని కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ సిరాజున్నీసా, కరీముల్లా, బరకత్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నియామకం


కోదండరామయ్య

పలమనేరు: అఖిల భారత గాండ్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పట్టణానికి చెందిన కౌన్సిలర్ కోదండరామయ్యను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు నియామకపత్రం పంపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గాండ్ల కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

కల్యాణ వైభోగమే..!



గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో గోదాదేవి శ్రీకృష్ణుని కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ధనుర్మాసం నెల ప్రారంభం నుంచి ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం నెల చివరి రోజున భోగి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం వేద పండితులు భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు.

పార్టీ పటిష్టతకు పాటు పడతా

పలమనేరు: చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులైన మైనారిటీ నాయకులు ముజ్జును పట్టణ వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యలపై పోరాటంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లా స్థాయి పదవినిచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కరుణాకరరెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడలకు రుణపడి ఉంటామన్నారు.

ఈరోజు

అయ్యప్ప స్వామి పూజలకు ఎమ్మెల్యే, ఎంపీ

పులిచెర్ల(కల్లూరు): పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ,రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి మండలంలోని పాళెం కొండపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 7 గంటలకు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా తెలిపారు.